# సుబ్బారావు ప్రేమ కథ

సుబ్బారావు సీతని గాఢంగా ప్రేమిస్తున్నాననుకుంటున్నాడు. సీతతో అంటున్నాడు.

సీత అతని మేనమామ కూతురే. ఆ మోమాటంతో ఆ పిల్ల సుబ్బారావు ప్రేమిస్తున్నానని చెపుతోంటే ఊరుకుంది.

సుబ్బారావు సన్నగా పొడుగ్గా, ఎప్పుడూ వూగే సర్వీ చెట్టులాగా వుంటాడు. అతని కిప్పుడు ఇరవై రెండో సంవత్సరం. కానీ, వాళ్ళ నాయనమ్మ "అబ్బే, మొన్నేగా పందొమ్మిది వెళ్ళాయి? కాలిపొడుగు సన్యాసి. వాళ్ళ తాత పోలిక" అంటుంది —తన భర్త సన్యాసితో పోల్చి!

సుబ్బారావు నాన్నని — "మీ వాడేం చదువుతున్నాడండీ?" అని ఎవరన్నా అడిగితే — "చాలా తెలివైన వెధవేనండీ! బాగా శ్రద్ధపడితే ఈ పాటికి ఎమ్మేగిమ్మే అయిపోయేవాడు!" అంటాడు. ఇంతకీ ఇప్పుడేం చదువుతున్నాడో చెప్పడు. చిన్నప్పుడు సుబ్బారావు ఎంతెంత తెలివిగల పనులు చేసేవాడో యాకరువు పెడతాడు. "వాడి పంతుళ్ళు తెగ హాచ్చెర్యపోయే వాళ్ళండీ! అంత తెలివైనవాణ్ణి మరీ ఎక్కువ చదివించ కూడదని వూరుకునేవారు...." అని వూరుకుంటాడు.

సుబ్బారావు తెలివితేటలు సమపాళంలోకి వొచ్చాక, అతను లెక్కలూ పజ్యాలూ మర్చిపోయాక, పంతుళ్ళు మళ్ళీ బాది చదివించేవారు.

తండ్రి అంచనా ప్రకారం, శ్రద్ధగా చదివితే ఎమ్మే అవ్వాల్సిన సుబ్బారావు కాస్త శ్రద్ధ తగ్గించినా బియ్యే అన్నా అయిపోయేవాడే. మరీ తగ్గించాడేమో అందులోనే చిక్కుపడి మిడుకుతున్నాడు.

అతగాడు సీతకి మొట్టమొదటిసారి ప్రేమ ఉత్తరం రాస్తూ — "సీతా! నా హృదయం చింపి చూడు! ('చింపి' అందామా? 'బద్దలుకొట్టి' అందామా? అని చాలా తీవ్రంగా ఆలోచించాడిక్కడ) అద్దం లేకుండా నా హృదయంలో నీ మొహం నువ్వు చూసుకుంటావు.... మీ నాన్న రాత్రి నాకు కల్లో కనపడ్డాడు, ఇంత దూరం వొచ్చి! మీసాల్లేవు. నిజంగా తీసేశాడా, ఇంకా అల్లాగే పెంచుతున్నాడా? ఈ ఉత్తరం సంగతి మీ వాళ్ళకు చెప్పకు సుమా! నీ దగ్గిరున్న చెక్కపెట్లో దాచు. ఈసారి నే నొచ్చినప్పుడు అమృతాంజనం డబ్బాల ఖాళీ పెట్టి తెచ్చి పెడతాను. ఎవ్వరికీ చూపించకూడదు ప్రేమ ఉత్తరాలు. సుబ్బులుకైనా సరే. తాటకిలాగా దాని జుట్టూ అదీనూ, దాని మొహం! దానికి మన ప్రేమ అర్థం కాదు" అని రాశాడు.

సీత, ఆ ఉత్తరం చదివి, బావ సుబ్బుల్ని తిట్టి తనని మెచ్చుకున్నందుకు రెండు రోజులు మురిసింది. సీతకీ సుబ్బులికీ స్కూల్లో రింగు ఆటలో పోట్లాటొచ్చింది. సుబ్బులు విసిరిన రింగు సీత ముక్కుకీ, మూతికీ తగిలి హనుమంతుడి పోలిక లొచ్చాయి. రెండు రోజుల తర్వాత సుబ్బులు సీత దగ్గిరి కొచ్చి "నిజంగా నేను కొట్టాలని కొట్టలేదే సీతా! అదే అల్లా తగిలిందే" అని యాడవబోతే అప్పటికి సీత — ముక్కు తగ్గి "పోన్లే, నేను మాత్రం యావన్నానూ?" అని శాంతించింది. తర్వాత బావ ఉత్తరంతో పడవ చేసుకోమని దాన్ని వానలో ఆడుకుంటోన్న తమ్ముడి కిచ్చేసింది.

సుబ్బారావుకి నవలల్లోనూ, సినిమాల్లోనూ, 'ప్రేమ'కన్నా 'భగ్నప్రేమ' నచ్చుతుంది. శెలవల్లో వొచ్చినప్పుడు సీతకి ఎన్నో కథలు చెపుతూ వుంటాడు. 'ప్రేమ రవ్వలు' సినిమా కథ సుబ్బారావుకి మరీ నచ్చింది. ఇంటికి రాగానే సీత దగ్గరికి పరిగెత్తి ఆ సినిమా కథ మొదలుపెట్టేశాడు. "ఏం, వాళ్ళిద్దరూ గాఢంగా ప్రేమించుకుంటారు. అప్పుడేమో.... ఒక రోజు...."

సీత ఆదిలోనే అడ్డొచ్చి "గాఢంగా అంటే?" అంది.

" 'గాఢంగా' అంటే.... అదే.... చాలా గాఢంగా అన్నమాట. అంటే.... అబ్బ! నువ్వు బాగా సినిమాలు చూడాలి సీతా! లేకపోతే ఎన్నాళ్ళిలా అజ్ఞానంలో

వుండిపోతావు?" అని విసుక్కున్నాడు.

"నువ్వు చూశావుగా? చెప్పరాదూ?" అని సీత మొహం ముడుచుకుంది.

సుబ్బారావుకి చాలా కష్టంవేసింది "అదికాదు సీతా! మీ నాన్న దరిద్రుడు అస్తమానూ సినిమాలు చూస్తే వొప్పుకోడు గానీ .... అది సర్లే! గాఢంగా అంటే ..... ప్రియురాలు వాళ్ళ దొడ్లో జాంకాయలన్నీ ఎవ్వరికీ ఇవ్వకుండా ప్రియుడికే ఇచ్చేస్తుందన్నమాట.... ఆ ప్రియుడేమో బిస్కట్లవీ కొనుక్కుంటే.... అసలు ఆ అబ్బాయి చాలా పేదవాడు. మహా నిరుపేద, అయినా ఎలాగో కష్టపడీ పడీ ఆ అమ్మాయికి బిస్కట్లవీ తెచ్చిపెడతాడు."

సీతకి నచ్చలేదు. మొహం చిట్లించి — "అంత పేదవాణ్ణి ఎందుకూ ప్రేమించడం?" అంది.

సుబ్బారావు అదిరిపడి — "ప్రేమకి అల్లాంటివేమీ వుండకూడదు. సీతా! అరే, నీకు తెలీదూ? తెలుసనుకున్నానే! ఆ అబ్బాయికి నొక్కుల జుట్టు వుంటుంది. ఎప్పుడూ టైట్ పేంట్సు వేసుకుంటాడు. అందుచేత ప్రేమించింది. సరిగ్గా విను మరీ. వింటావా, మానెయ్యనా?"

"వింటున్నాగా బావా! చెప్పు."

"ఏం? వాళ్ళిద్దరూ గాఢంగా ప్రేమించుకుంటారా? పెద్దవాళ్ళు, వల్ల కాదంటారు."

"ఎందుకు వల్ల కాదంటారు?"

"ఎందుకా? వాళ్ళు పెద్దవాళ్ళు కదా? అది అంతే! పెద్ద వాళ్ళందరూ అలాగే అంటారు. పాపం ఇద్దర్నీ చాలా కష్టాలు పెడతారు."

"ఏం కష్టాలు?"

"పాటన్నా పాడుకోనివ్వరు. డాబా మీదనించన్నా చూసుకోనివ్వరు. ఏం, పాపం వాళ్ళిద్దరూ అర్థ రాత్రుళ్ళు ముళ్ళల్లోంచీ.... చీకట్లోంచీ వెళ్ళి రహస్యంగా వొక అడవిలో కూర్చుని మాట్లాడుకుంటారు!"

"అమ్మో! భయం వెయ్యదూ?"

"ఛీ! భయపడకూడదు, మరి ప్రేమంటే ఏవిటనుకున్నావు? ఎంత గొప్పదో! దేనికీ భయపడకూడదు."

"గొప్పదేలే. పాములుంటే చీకట్లో?"

"ఉంటాయి. కానీ కరవ్వు సీతా! ప్రేమికుల్ని చూసి జాలిపడి తప్పుకుని వెళ్ళిపోతాయి, ఏం...."

"పాములు జాలిపడ్డం ఏమిటి?" అందామనుకుంది సీత. బావకి కోపం వొస్తుందని వూరుకుంది.

"ఏం, అప్పుడు వాళ్ళిద్దరూ దూర దూరంగా నించుని కన్నీళ్ళతో మాట్లాడుకుంటారు."

"దూరంగా నించోడం ఎందుకూ?"

"మరి దగ్గిరికెలా వొస్తారు? సంఘం అడ్డు లేదూ?"

"అదేం చెట్టు?"

"అబ్బబ్బా! అది చెట్టుకాదు.... అవును చెట్టే! 'సంఘం' అనే చెట్టు."

"సరిగ్గా చెప్పు బావా! నాకేం అర్థం కావటం లేదూ."

"నువ్వసలు సరిగ్గా విను సీతా! వాళ్ళిద్దరూ ప్రేయసీ ప్రియులేగానీ భార్యాభర్తలు కారు గదా? అంచేత ఒకర్ని ఒకరు ముట్టుకోకూడదు. అందుకే దూరంగా నించుంటారు!"

"ఎంత దూరంగా?"

"ఎంతో కొంత లెద్దూ! పది అడుగులు అనుకో."

"అమ్మో! చీకట్లో అంతదూరంగా నించుంటే వొకళ్ళకొకళ్ళేం కనపడతారూ! మాటలేం వినబడతాయి?"

"అబ్బ! వినబడతాయ్‌లే. వాళ్ళకేం చెముడా? విను ముందు, ఏం? అల్లా కొంతసేపు మాట్లాడుకుని .... ప్రియురాలు ప్రియుడి పాదధూళి తీసుకుని తల చుట్టూ చెంగు కప్పుకుని నిశ్శబ్దంగా నడుస్తూ దూరం అయిపోతుంది. తర్వాత ప్రియుడు వైరాగ్యంతో మంచం పడతాడు...."

"మంచం ఎక్కడిదీ? చాలా పేదవాడన్నావుగా?"

"అబ్బా! ఎంత పేదవాడైతే మాత్రం నులక మంచం అన్నా వుండదా? పోనీలే, 'చాప' పడతాడు! లేకపోతే, 'నేల' పడతాడు. ఏం, తీరిందా నీ సందేహం? వెధవ ప్రశ్నలూ నువ్వూనూ."

"అల్లా తిట్టావంటే నేనెళ్ళిపోతాను బావా!"

"ఛ! వూరికే తిట్టాను సీతా! ఏం? విను మరీ. పాపం అతనికి దగ్గు — టీ.బీ."

"అమ్మో! అతన్ని పెళ్ళి చేసుకోకపోవటమే

మంచిదైంది."

"ఛ! ఆ అమ్మాయి ఏడుస్తూ వొచ్చేసి విసనకర్రతో విసురుతూ ఎంత సేవ చేసిందనీ!"

"అంతేనా సేవంటే? విసిరితే చాలా?"

"అదే! మంచినీళ్ళవీ ఇస్తుంది! పక్క సర్దుతుంది. ఇంకేం చెయ్యాలి? — పాపం ఆ అబ్బాయి వొకనాడు మొదలుపెట్టి మర్నాటి దాకా దగ్గి, దగ్గి, దగ్గి, దగ్గి అలా వాలిపోతాడు ప్రియురాలి వొళ్ళో. ఆమె కెవ్వున అరిచి విశనకర్రతో అతనిమీద పడిపోతుంది."

"ఏవన్నా ప్రాణం వుంటే పోడానికా?"

"నీకు జాలెయ్యడం లేదూ?"

"వేస్తోందనుకో. ఊఁ, చెప్పు."

"రెండు దేహాలూ వొకే చితిలో.... ఆకాశం ఎత్తు మంటల్లో.... మాయం అయిపోతాయి. ఇంతకీ వాళ్ళు చచ్చిపోయారనుకున్నావా?"

"మరేమయ్యారూ?" కళ్ళు విప్పార్చుకుని అన్నది సీత.

"ఇద్దరూ నవ్వుతూ, తెల్లబట్టల్తో, నెమ్మదిగా పైకి లేచి మబ్బుల్లో కలుసుకుని .... ఎంతో సుఖంగా...."

"పోదూ! నిజంగా మబ్బుల్లో కలుసుకుంటారా?"

"ఎందుక్కలుసుకోరూ? అంత నిష్కల్మష ప్రేమికులు."

"ఏమో బాబూ! నాకేం నమ్మకంలేదు. చచ్చిపోయిన వాళ్ళు మళ్ళీ బతకరని సుందరం బావ చెప్తాడే!"

"ఏడిశాడు. వాడికేం తెలుసు? వాడు చచ్చాడంటే, చస్తే బతకడు."

"ఛీ, అలా అనకు బావా! పోనీ ఆ ప్రేమికులు బతుకుతారనుకో. ఆ మబ్బుల్లో ఇల్లా, వాకిలా? ఎవరైనా సరే .... చక్కగా ఇక్కడే పెళ్ళి చేసుకుని .... ఇక్కడే సుఖంగా బతకాలి."

సుబ్బారావు చాలా నిరుత్సాహపడ్డాడు. "ఈ సీత, ప్రేమకే గానీ, భగ్న ప్రేమకి పనికొచ్చేలా లేదు" అని నిట్టూర్చాడు.

★ ★ ★

సుబ్బారావు మొన్న శలవల్లో చాలా తమాషాగా ఇంటికొచ్చాడు. ఆర్నెల్లనించి క్షవరం మానేసి చీకేసిన తాట్టెంకలాగ చేసుకున్నాడు జుట్టు. పెద్దపెద్ద పువ్వుల లూజు పైజామా, ఒంటికి తుమ్మ జిగురేసి అంటించి నట్టున్న జాకెట్టూ, బండి చక్రాలంతంత ప్రేమ కళ్ళజోడూ! దాన్ని చేత్తో పట్టుకున్నాడు జారిపోతుందని. కాళ్ళకి తళుకు గుండీలున్న చెప్పులూ, నడుముకి ధగధగ మెరిసే బెల్టూ, ఇంకా చిన్న చిన్న ముస్తాబులు చాలా ఉన్నాయి!

వీధి అరుగుమీద కూచున్న వాళ్ళ నాన్న అప్పుడప్పుడూ అలాంటి వేషాలు చూసేవున్న వాడవటంచేత ఎక్కువ కంగారు పడకుండా సుబ్బారావుని చూసి "మా సుబ్బారావింకా రాలేదబ్బాయ్! ఇవ్వాళో రేపో వస్తాడని చూస్తున్నాం. మంచినీళ్ళు పుచ్చుకుంటావా?" అన్నాడు.

సుబ్బారావు జవాబు చెప్పకుండా "నాయనమ్మా!" అని కేకలేస్తూ ఇంట్లోకి జొరబడ్డాడు.

ఆవిడ కళ్ళు చిట్లిస్తూ, వెలుగు పడకుండా చెయ్యి అడ్డం పెట్టుకుని చూసింది — "ఈ పరికిణీ ఎప్పుడు కుట్టించుకున్నావే సుబ్బులూ? నీ దుంపతెగా! ఎంత పొడుగెదిగావే! ఇంక పైటలు వేసుకోవాల్సిందే! ఆ జుట్టు దువ్వుకు చావవుగదా?" అని బోసినోటితో నవ్వింది.

సుబ్బారావుకి కోపమొచ్చి — "నీ మొహంలే. కళ్ళజోడెక్కడ పారేశావు? నా కాక లేస్తోంది. ఏవన్నా పెట్టు!" అని గడపమీద చతికిలబడ్డాడు.

అప్పటికి నాయనమ్మ, సుబ్బులి ఆశ్చర్యంలోంచి తేరుకుని, అటెనక సుబ్బడి ఆశ్చర్యంలో పడింది. "నీ పిచ్చి దొంగల్దోలా! ఇవేం గుడ్డల్రా! ఇదేం వాలకంరా! ఇవేం...." అంటోంటే, వాళ్ళ నాన్న వెనకనించి అందుకుని — "ఆ జుట్టేవిటీ! పంట్లాం ఏవిటీ! ఆ రవికేవిటీ! ఆ కళ్ళ జోడేవిటీ! ఆ చెప్పు లేవిటీ! ఆ పటకా ఏవిటీ! ... ఏవిటీ! ... ఏమిటీ?" అని పది పన్నెండు ... ఏవిట్ల ప్రశ్నలు వేశాడు.

నాయనమ్మ మళ్ళీ వేసింది, మార్చి.

నాన్న మళ్ళీ వేశాడు, మార్చి, మార్చి.

ఆ ఇరవై ప్రశ్నల్నీ ఎగరగొట్టి — "అబ్బ! నా కాక లేస్తోందే? యేవన్నా పెట్టవే" అన్నాడు సుబ్బారావు కోపంగా.

"వెంకట్రత్తం వాళ్ళ కోడలు 'సారి' తెచ్చింది. చలివిడీ, మిఠాయీ వున్నాయి తింటావూ?" అంది నాయనమ్మ.

"పట్రా! అర్జంటు, పరుగెత్తు" అంటూ సుబ్బారావు గడపమీదే బాసింపట్టు వేసుక్కూర్చున్నాడు.

సుబ్బారావు తింటున్నంతసేపూ నాయనమ్మ హాశ్చర్యపోతూనే వుంది. "పిచ్చి సన్నాసి! మొగపిల్ల లెక్కడన్నా పరికిణీ కట్టుకుంటారుట్రా! ఇంకా నయం, చీర కట్టుకున్నావు కావు" అంది.

సుబ్బారావు నోటికడ్డం పడ్డ మిఠాయి దిగ మింగేసి "అబ్బా, ఇది పరికిణీ కాదే నాయనమ్మా! బెల్ బాటమ్స్! బెల్ బాటమ్స్ అంటే తెలుసా? గంట మట్లు" అన్నాడు.

"నీ మొహంలే. పరికిణీని ఇంగిలీషులో అలా అంటారు కావున్ను! ఎబ్బే! ఏం బాగున్నా యీ గుడ్డలూ? సీతకిచ్చెయ్యి, అది కట్టుకుంటుంది. మా సుబ్బడు మంచివాడమ్మా! చక్కగా మంగలి రావుఁడు దగ్గిరికెళ్ళి క్షవరం చేయించుకురా. నీళ్ళు కాగబెడతాను — తలంటుకుని నీ పంట్లాం తొడుక్కో. అంతేగాని.... అయ్యయ్యో! తుప్పల్లే ఇదేం జుట్టమ్మా! పేలు లేవుట్రా? దువ్వమంటావా?"

సుబ్బారావు మర చెంబుడు మంచినీళ్ళు తాగి లేచి — "సీత దగ్గిర కెళ్తానే" అన్నాడు.

"ఏవిటీ! ఈ గుడ్డల్తోటే! మీ మామయ్య తిడ తాడ్రా."

"ఏడిశాడు. నేనూరుకుంటానా?" అని అంగలేసు కుంటూ వెళ్ళిపోయాడు, సుబ్బడు.

సీత సుబ్బారావుని చూసి నిజంగానే నవ్వింది. మిగతా చిన్నపిల్లలు ఆ బట్టలూ అవీ ముట్టుకుని చాలా సరదా పడ్డారు. అందరూ ఆనందించారుగానీ వాళ్ళ మాఁవ.. "ఏమిటోయ్ ఈ వేషం? నీ బాబు చూశాడా?" అన్నాడు.

సుబ్బారావు మాట్లాడలేదు.

"ఇంతకీ ఈ సంవత్సరం పేసయ్యే దేవన్నా వుందా?" అన్నాడాయనే మళ్ళీ.

"ఉంటే వుంది, లేకపోతే లేదు; నీ కెందుకోయ్?" అందామనుకున్నాడు సుబ్బారావు. లేకపోతే "ఉందో లేదో కనుక్కో" అనన్నా అందామనుకున్నాడు. "ఎందు కులే, ఏడ్చిపోతాడు" అని నవ్వేసి వూరుకున్నాడు.

"నువ్వేవిటో తవ్వి తలకెత్తుతావని నీ బాబు మురుస్తున్నాడు. నువ్వింకేం బాగుపడతావు?" అని ప్రశ్న వేసి జవాబు వినకుండానే వెళ్ళి పోయాడాయన.

మహా తిరస్కారంగా చూశాడు. వెనక నుంచి సుబ్బారావు.

"మా నాన్నకి కోపం వొచ్చినట్టుంది బావా!" అంది సీత నెమ్మదిగా భయపడుతూ.

"మీ నాన్న మొహంలే. పల్లెటూరి గబ్బిలాయి."

"మీ నాన్నా పల్లెటూరి వాడేగామ్మా?" అని మూతి ముడుచుకుంది సీత.

సుబ్బారావు నవ్వేసి — "సీతా: మొన్న 'ప్రేమాగ్ని' సినిమాలో...." అని కొత్త కథ మొదలుపెట్టాడు.

ఆ కథలోకూడా ప్రేయసీ ప్రియులు అంతు లేనన్ని కష్టాలుపడ్డారు. ఈ ప్రపంచం పుట్టినప్పట్నించీ మనుషులందరూ కలిసి ఇప్పటికి మొత్తం ఎన్ని కష్టాలు పడ్డారో అన్ని కష్టాలు వాళ్ళిద్దరే పడ్డారు!

ఆ అమ్మాయిని తండ్రి దరిద్రుడు మహా అన్యా యంగా శంకించాడు — "ఛీ! నా కడుపున చెడ బుట్టావు, పాపిష్టిదానా!" అని తిట్టాడు.

"వాళ్ళమ్మ కడుపునేగా పుట్టిందీ? నాన్న కడుపున కాదుగా?" అంది సీత ఆశ్చర్యంగా.

"అబ్బ, అదే! అమ్మా నాన్నా వొకటేగా? అసలు కథ విను ముందు. ఏం, ఆ అమ్మాయి గోడుగోడున ఏడ్చి — 'ఇంకా నేను కాలు జారలేదు నాన్నా!' అని ఎంత చెప్పినా నమ్మడే!"

"కాలుజారడం ఏమిటి?" అని తెల్లబోయింది సీత.

" 'కాలు జారడం' అంటే.... మరి తప్పుకాదూ? అదే .... అబ్బ! నువ్వు రెండ్రోజులుకో సినిమా అన్నా చూడాలి సీతా! ఈ పుస్తకాలూ — బళ్ళో చదువులూ ఇవన్నీ మనకి జ్ఞానం ఇస్తాయనుకుంటున్నావా? సర్లే! ఇంకోసారి చెప్తాలే. కథ వినుముందు. ఆ అబ్బాయి తాతకి కొంచెం దగ్గు వొస్తోందని టెలిగ్రాం వొస్తే అర్జంటుగా వెళ్ళిపోతాడు. ఆ దగ్గు ఎంతకీ తగ్గదు. అక్కడ, ఆ అబ్బాయికి ప్రేయసి కలల్లో కొస్తోంది. ఏం

చేస్తాడు? ఇటు తాత! అటు ప్రేయసి! కుమిలిపోతూ వుంటాడు. వెధవ తాతలూ గీతలూ వుంటే, అదే ఇబ్బంది! థాంక్ గాడ్! మనకి తాతల్లేరు."

"నీకు నాయనమ్మ వుందిగా?"

"నాయనమ్మలు మంచివాళ్ళు సీతా! వాళ్ళు ఎంత మంది వున్నా బాగుంటుంది. అయినా, మా నాయ నమ్మకి దగ్గు రాదుగా?"

"ఏమో! ఇంకా వొస్తుందేమో తర్వాత?"

"అవును సీతా, నిజమే. బాగా చెప్పావు. ఇవ్వాళ సాయంత్రంనించే ఏదన్నా మందు వాడితే సరి. దగ్గితే మాత్రం వొప్పుకోనంటాను, నా సంగతి నీకు తెలీదు. పిచ్చికోపం నాకు. సర్లే! కథ విను. ఏం, ఇవతల ఈ అమ్మాయి — 'రావోయి ప్రియతమా! దయగనవా ప్రియతమా! అః అః అః....' అని పాటలు పాడుతూ వుంటుంది."

"ఓ సారి ఉత్తరం రాయరాదూ? పాట వినపడు తుందా పెడుతుందా, ఇంకో ఊరుకి?"

"అదే వొచ్చింది సీతా ఇబ్బంది. పాపం ఆ అమ్మా యికి ప్రియుని ఎడ్రస్ తెలీదు. ఆ అబ్బాయికూడా తాత దగ్గు కంగారులో ఏమీ చెప్పకుండా వెళ్ళి పోయాడు. అతని ఊరుకూడా తెలీదు ఆ అమ్మా యికి?"

"పోనీ అతనే రాయొచ్చుగా నేనిక్కడ వున్నాననీ."

"అయ్యయ్యో! ఎన్నో రాశాడు సీతా! ఆ పిల్ల నాన్న తీసుకుని ఆ ఉత్తరాలన్నీ చింపేశాడు. వాడు ఆఫీసు కెప్పుడెళ్తాడోగానీ పోస్టుమేన్ వొచ్చేవేళకి వీధిలోనే వుంటాడు. పాపం ఈ రహస్యం ఆ అమ్మాయి కేం తెలుసు? ప్రియుణ్ణి శంకించింది, లోపల్నించి అంత రాత్మ కూడా — 'పిచ్చిదానా! నీ ప్రియుడు మోసగాడే' అని చెప్పింది.

తండ్రి ఇంకో సంబంధం కుదిర్చేశాడు.

ఆ అమ్మాయి పెళ్ళికి వొప్పేసుకుని ఏడుస్తూ పెళ్ళి పీటలమీద కూచుంది. సీతా! ఆ దుఃఖం నువ్వు చూస్తే ఓర్చుకోలేవు. అప్పుడేమైందో తెలుసా? ప్రియుడు వొచ్చేశాడు........"

ఆ తర్వాత కథ స్పీడ్‌గా నడిచింది. తల్లిదండ్రులు ఇద్దర్నీ తిట్టి కొట్టి బాధించారు. సంఘం వెలేసింది. పారిపోతే అడవుల్లో ముళ్ళు గుచ్చుకున్నాయి. తేళ్ళు కుట్టాయి. పాములు కరిచాయి. సింహాలు తరుము కొచ్చాయి — (అడవుల్లో ఇంకా ఏమేం జంతువులు వుంటాయో సినిమా వాళ్ళకి తెలీదు. తెలిసినా అవన్నీ షూటింగుకి బయల్దేరి రావు కదా? అందుకే సింహాలతో సరిపెట్టారు.) — పరిగెత్తి పరిగెత్తి ఇద్దరూ విడి పోయారు. రైలు కూతవేస్తూ అడ్డం వొచ్చింది. ప్రియు రాలు నీళ్ళలోకి దూకింది. వందమైళ్ళు కొట్టుకు పోయిం తర్వాత ఎవరో రక్షించారు — ప్రాణం నిలి చిందిగానీ మతిపోయింది. ప్రియుడికి ఏదో జబ్బు వొచ్చి రూపం పోయింది. — అబ్బ! ఆ కష్టాలు సుబ్బా రావు చెప్పలేకపోయాడు. సీత వినలేకపోయింది.

కష్టాలు పడీపడీ (సినిమా వాళ్ళకి తోచిన, పెట్టదగ్గ కష్టాలన్నీ అయిపోయాక) చివరికి వొక్క నిమిషంలో సినిమా అయిపోతుందనగా వాళ్ళిద్దరూ కలుసు కున్నారు!

"హమ్మ! కలుసుకున్నారు గదా?" అని తేలికపడి సరిగ్గా కూచుంది సీత.

సుబ్బారావు నిట్టూర్చి — "వాళ్ళు చచ్చిపోయి వుంటే ఎంత బాగుండి వుండేది!" అని నిరాశగా చూశాడు.

"చచ్చిపోతే బాగుంటుందా ఎక్కడన్నా?" అంది సీత.

ప్రేయసీ ప్రియులు బతికి మామ్మూలు భార్యా భర్తలు అయిపోయారన్న విచారంతో సుబ్బారావు ఏమీ మాట్లాడలేకపోయాడు.

★ ★ ★

సుబ్బారావు క్షవరానికి నాయనమ్మ వరసగా వారం రోజులు డబ్బులిచ్చింది. ఇంక రెండో వారం నమ్మడం మానేసింది. సుబ్బారావు కూడా నమ్మిం చడం మానేశాడు.

వాళ్ళ నాన్నకి చూసి చూసి కోపం వచ్చి "గడ్డి మేటులా ఆ తల బరువేవిట్రా? తిరగేసి నించోబెడితే బాగుండేట్టుంది. నాయనమ్మతో దువ్వించుకుని జడన్నా వేయించుకో" అని తిట్టి వెళ్ళాడు.

"హారే, పిచ్చి నాయనా! నువ్వు తిన్న తిండంతా ఆ

జుట్టుకే ఎక్కుతోందిరా. అది బలుస్తోందిరా! నువ్వు చిక్కుతున్నావురా! చూడు ఈ చొక్కా ఎంత వొదులై పోయిందో" అని విచారించింది నాయనమ్మ.

"నీ మొహంలే. తలగడ దిండు నిండా దూది వున్నట్టు నన్ను చొక్కా నిండా వుండమంటావా ఏమిటే?" అని క్షవరం మాట ఎగరగొట్టి — "నాయనమ్మా! ఉప్పుడు పిండి చెయ్యవే, తిని యెన్నాళ్ళయిందో!" అని గారం గుడిశాడు.

సరిగ్గా అప్పుడే సీత పరుగెత్తుకొచ్చి — "బావా! మాట!" అని గదిలోకి లాక్కుపోయింది — "మా నాన్న సుందరం బావా వాళ్ళ సంబంధం గురించి ఉత్తరం రాస్తానని మా అమ్మకి చెప్తున్నాడు. నే నిల్లా పరుగెత్తుకొచ్చాను" అని బిక్క మొహం వేసింది.

సుబ్బారావు తెల్ల మొహం వేశాడు — "ఏం? ఎందుకు? మనం ప్రేమించుకున్నాం అని ఆ రాక్షసుడికి తెలీదూ?"

"ఏమో మరి. మా అమ్మ చెప్పింది కూడానూ. 'సీతకీ సుబ్బారావుకీ ఈడూజోడూ' అంటే, నాన్న మండిపడి — "ఆ జులాయి వెధవకి పిల్లనిస్తే దాని బతుకు కడతేరినట్టే! వాడికంత బుద్ధీ జ్ఞానం వొస్తే, చిన్న దాన్ని చేద్దాంలే అన్నాడు."

"ఎవర్ని? సావిత్రినా? ఆ పిడత మొహం దాన్నా?" అని సుబ్బారావు మండిపడ్డాడు.

"అది అందంగా వుంటే ఫరవా లేదా? అంతేలే, నీ కబుర్లన్నీ అబద్దాలే" అని మొహం ముడుచుకుంది సీత.

"ఛ, ఛ! అదికాదే సీతా! నా హృదయం చీల్చి చూడు. ఎవరు కనబడతారో!"

సీత బాగా మెత్తబడి — "మరి ఇప్పుడేం చేద్దాం? అది ఆలోచించు ముందు" అని కంగారు పెట్టింది.

"అవును, ఏం చేద్దాం? అసలు మీ నాన్న రాక్షసుడు అలా ఎందుకన్నాడు?"

"ఎందుకల్లా మా నాన్నని తిడతావు? ఈ గుడ్డలూ ఈ జుట్టూ చూస్తే పెద్దవాళ్ళ కెలా వుంటుందేవిటి మరి? చక్కగా క్షవరం చేయించుకుని అందంగా పేంటు తొడుక్కుని వొకసారి మా ఇంటికి రా. నాన్న మళ్ళీ నిన్ను చూస్తాడు నేను సుబ్బారావు బావనే చేసుకుంటానని మా అమ్మకి చెప్పేస్తాను...."

"నా జుట్టు ఫేషన్‌కీ, నా గాఢ ప్రేమకీ లంకె పెడతాడన్న మాట నీ బాబు! నా ఇష్టం. నేను క్షవరం చేయించుకోను. నా కెవడు క్షవరం చేస్తాడో చూస్తాను" అని గంతులేశాడు సుబ్బారావు.

"అలా అయితే మనకి పెళ్ళవదు."

"అవకపోతే పొమ్మను. ఎవడిక్కావాలి పెళ్ళి?"

"అదేంటి బావా? మతిపోయిందా నీకు? .... మన పెళ్ళి...."

"మరైతే ఏం చెయ్యమంటావు, క్షవరం తప్ప!"

"నీ కోసం ఏం చెయ్యమన్నా చేస్తాను సీతా — అనేవాడి వెందుకూ పెద్ద బడాయిగా? క్షవరం చేయించుకోకపోతే ఇలాగ కవుర్లన్నీ చెప్పుకోవచ్చు, పెళ్ళి తప్ప!"

క్షవరానికి ప్రేమ చరిత్రలో ఇంత ఉచ్ఛస్థానం వుందా — అని తెగ ఆశ్చర్య పడిపోయాడు సుబ్బారావు.

సీతకి కోపం వొచ్చి — "సరే! నేను సుందరం బావనే చేసుకుంటాను" అనేసి వొచ్చినంత విసురుగానూ పరిగెత్తింది.

"ఉప్పుడు పిండి తిని పోదువుగాని వుండవే" అని నాయనమ్మ పిలుస్తోనే వుంది. సీత వెళ్ళేపోయింది.

"అయిపోవొచ్చింది. నీకన్నా పెడతాను రారా సుబ్బా!" అంది నాయనమ్మ.

"అబ్బ, వుండవే, వెధవ ఉప్పుడు పిండీ నువ్వూనూ. క్షవరం చేయించుకోవాలి" అని వీధిలోకి పరిగెత్తాడు సుబ్బారావు.

"హోరి వీళ్ళ పరుగులు చల్లగుండా!" అని నాయనమ్మ తెల్లబోయి తేరుకునేంతలో సుబ్బారావు అంట కత్తిరేయించుకొచ్చి — "నీళ్ళు కాగుతున్నాయి, వుండరా" అంటోంటే వినకుండా, 'ప్రేమకోసం కష్టాలు పడలేనా' అనుకుంటూ, చన్నీళ్ళ తొట్టి దగ్గర నిలబడి గబగబా పది చెంబులు దిమ్మరించుకుని గదిలో దూరి పేంటూ, పొడుగు చేతుల చొక్కా వేసుకుని హడావుడిగా వీధిలోకి పరిగెత్తాడు.

సీత అక్కడక్కడా కబుర్లు తెముల్చుకుని అప్పటికి ఇంటికొచ్చి, చావిట్లో సుబ్బారావుని చూసి ఎవరో

అనుకుని పక్క వసారాలోంచి తప్పుకోబోతోంటే సుబ్బారావు వెనక గుమ్మంలోంచి ఎదురుపడ్డాడు — "ఏడీ మీ నాన్న? రమ్మను, చూస్తాడు. దుర్మార్గుడు! నా అందమైన జుట్టంతా పొట్టన పెట్టుకున్నాడు. అందుకే వాడికి బట్టతల అవుతోంది. బుద్ధిరాదు. రమ్మను, తొరగా. మళ్ళీ ఎదిగిపోతోంది జుట్టు" అని చిందు లేశాడు.

సీత హాచ్చర్యపడి — "ఛీ! అంత గుండు చేయించుకున్నావేమిటి? చక్కగా క్రాఫింగు వుంటే అందంగా వుండేది. ఛీ! నాకేం నచ్చలేదు. ఛీ!" అని ఛీఛీ కొట్టింది.

సుబ్బారావుకి వొళ్ళు మండిపోయి — "చివరికి ఇదన్న మాట! నీ కోసం ఇంత గొప్ప త్యాగం చేస్తే .... సర్లే! ప్రియురాళ్ళెప్పుడూ ఇలాంటి మోసాలు చేస్తారని నాకు బాగా తెలుసు! బాగా తెలుసు!" అనేసి బాణం లాగ వీధిలోకి దూసుకుపోయాడు.

వెనకనించి చూస్తే సుబ్బారావు చాలా అందంగా కనిపించాడు సీతకి.

ఇంటికి దూసుకొచ్చిన సుబ్బారావు — నెయ్యీ బెల్లం వేసుకుని గిన్నెడు ఉప్పుడు పిండి తిని నాయనమ్మని చాలా ఆనందపెట్టాడు.

★ ★ ★

సీత నాన్న, సుబ్బారావు నాన్నతో మాట్లాడాడు. సీత పెళ్ళి గురించే. నాయనమ్మతో కూడా మాట్లాడాడు. అందరూ కుమ్మక్కై (సుబ్బారావే అన్నాడలాగ సీతతో) సీత పెళ్ళి సుందరంతోటే కుదర్చాలనుకున్నారు.

సుందరం ఎవరో కాదు. సీతకీ సుబ్బారావుకీ మధ్య హఠాత్తుగా అడ్డొచ్చిన నిర్దయుడుకాడు. సుబ్బారావు సీతకి మేనత్త కొడుకైతే, సుందరం మేనమామ కొడుకు. సీత అందమైంది కావటంచేత సీత నాన్నకి డబ్బు కూడా బాగానే వుండటంవల్ల, సుందరం తల్లి "సీత మా కోడలే" అని పాడుతోనే వుంది ఎప్పట్నించో.

సీత బాగా చిన్నప్పుడు సుందరంతో కూడా ఆడుకునేది. పెద్ద వాళ్ళయ్యాక సుందరంతో చనువు లేదు. ఎప్పుడన్నా వొస్తే ముసిముసి నవ్వుల్తో దొంగ చూపుల్చూస్తుంది.

తన పెళ్ళి సుందరంతో కుదిరిపోతూ వుంటే మొదట్లో సీత కొంచెం గునిసి, సుబ్బారావుమీదే ఇష్టం ప్రకటించింది.

వాళ్ళమ్మ సీతని కూచోబెట్టి జడేస్తూ "సుబ్బారావు మంచివాడే అనుకో. సుందరం ఇంకా మంచివాడు. అప్పుడే బియ్యే పేసయ్యి బెజవాళ్ళో ఉద్యోగం చేస్తున్నాడు. సుబ్బారావుని చేసుకుంటే ఈ పల్లెటూళ్ళో పడివుండాల్సిందేగా? ఓ అచ్చటా, ముచ్చటా? బస్తీలో అయితే చక్కగా బావా, నువ్వూ ఓ సినిమాకేనా.... ఓ షికారుకేనా.... ఆ ఇదే వేరు...." అని సుందరం బావని పెళ్ళాడితే, సినిమాలు చూసే అవకాశాలు ఎలా వస్తాయో వర్ణించి చెప్పి సుందరం సంబంధమే మంచిదనీ, బుద్ధిగా వొప్పేసుకోమనీ, బోధించింది.

సీత పెళ్ళి సుందరంతో అయిపోతే, సావిత్రి కోసం సుబ్బారావుని అట్టే పెట్టుకోవొచ్చునని ఆవిడ ఆలోచన.

సీత మనసు సుందరం వేపే మొగ్గుతోన్నా సుబ్బారావు మీద చాలా జాలికలిగి, ఏం చెయ్యాలో తోచక దిగులుగా సుబ్బారావు దగ్గిరికొచ్చింది — "బావా! చివరికి నువ్వన్నట్టే అయింది. మనం దూరం అయిపోతున్నాం. నా కట్టెకే పెళ్ళి చేస్తున్నారు!" అని మనస్ఫూర్తిగానే విచారించింది.

సుబ్బారావు చాలా ఆవేశపడతాడనుకుంది. వెర్రి కోపంతో పెద్ద వాళ్ళందర్నీ తిట్టి, వాళ్ళతో పోట్లాడి, ఏదో రాద్ధాంతం చేసి, తమ ప్రేమనే నిలబెడతాడనుకుంది.

సుబ్బారావు చాలా నిరుత్సాహంగా కళ్ళు తేలేసి చూస్తూ — "సీతా! మనం దురదృష్టవంతులం. ఈ పెద్ద వాళ్ళెవరికీ ప్రేమ తెలీదు. వీళ్ళు వొక్క సినిమా అన్నా చూడరు. ఈ దుర్మార్గులంతా కుమ్మక్కై మన జీవితాలు ధ్వంసం చేస్తున్నారు. మన ప్రేమ నౌక ఈ జ్ఞానహీనుల పంతాల సుడిగుండాలలో చిక్కుకుని మునుగుతోంది! — ('నా ప్రేమనౌక సాంప్రదాయాల కొండలకు తగిలి బద్దలైంది' అని వొక కవి అన్నాడని ఎక్కడో చదివాడు సుబ్బారావు. ఆ మాటలే తనుకూడా అనడానికి సందు దొరికిందని కొంచెం సంతోషంగానే వుంది సుబ్బారావుకి!) మనం నిస్సహాయులం సీతా! ఏమీ చెయ్యలేం' అని నిట్టూర్చాడు నాలుగోసారి.

"పంతాలేమీ లేవు. వాళ్ళంతా బాగానే వున్నారు. ఎందుకో ఇలా చేస్తున్నారు. పోనీ నువ్వొకసారి మా నాన్నని అడుగు బావా! నేనుకూడా అడుగుతాను."

"ఛీ! ఆ రాక్షసుణ్ణా?"

"పోనీ మీ నాన్నని అడుగు."

"హూ: ఆ నిర్దయుణ్ణా?"

"మరి మన పెళ్ళెలా అవుతుంది బావా?"

"అవదు. ఈ లోకంలో మనం కలుసుకోలేము."

సీతకి విసుగొచ్చింది. దిగులుగా వింటూ కూర్చుంది.

"సీతా! మా స్నేహితుడి జీవితంకూడా ఇలాగే చేశారు పెద్దవాళ్ళు. కట్నాలకు ఆశపడి, వాడి ప్రేమకి ఆనకట్ట కట్టారు. ఇంకో స్నేహితుడు వర్ణాంతరం అమ్మాయిని ప్రేమిస్తే ససేమిరా వీల్లేదన్నారు."

సీత అడ్డొచ్చి — "అసలు పెద్దవాళ్ళమాటలు వినడం ఎందుకూ? ఎదిరించలేరూ?" అంది.

"హయ్యో! పిచ్చి సీతా! నీకింకా తెలీదు. ఇది క్షుద్రలోకం. మూర్ఖ సంఘం. ఈ కసాయి ఆచారాలు మారాలి. ప్రేమికుల్ని విడదీసే పెద్దలు తునాతునకలై నశించిపోవాలి. అంతవరకూ మనవంటి దౌర్భాగ్యులు బలిగాక తప్పదు. మన జీవిత రధాలు కుంటుపడిపోక తప్పదు!" అని 'ఖంగ్, ఖంగ్'మని దగ్గాడు.

"అయ్యో, దగ్గు వస్తోందేం నీకు?" అని కంగారు పడింది సీత.

"ఇది జబ్బుదగ్గు కాదు సీతా! ప్రేమ నెరవేరకపోతే దగ్గు వస్తుంది. 'ప్రేమావేశం' సినిమాలో.... ఇలాగే దగ్గుతోటే ఆ ప్రియుడు..."

సీతకి విసుగెక్కువైంది — "సరే బావా! మా అమ్మ తిడుతుందేమో! కరివేపాకు తెమ్మని చెప్పింది" అని సీత విచారంగా నెమ్మదిగా వెళ్ళిపోయింది.

★ ★ ★

సుబ్బారావు చూస్తూ చూస్తూ వుండగానే సీత పెళ్ళి అయిపోయింది. సుందరం సీతని, గద్ద వొచ్చి మిఠాయి పొట్లం తన్నుకుపోయినట్టు తన్నుకు పోయాడు.

సీత పెళ్ళినాడు సన్నాయీ, బ్యాండు మేళం వినపడుతోంటే, సుబ్బారావుకి చాలా దుఃఖం వొచ్చింది. ప్రేయసీ ప్రియులు ఆత్మహత్యలు చేసుకున్న కథలు చాలా జ్ఞాపకం వొచ్చాయి. సీతని చాటుగా పిలిచి "మనమిద్దరం ఆత్మహత్య చేసుకుందాం. అందరి తిక్కా కుదురుతుంది" అని చెప్తే? సీత వొప్పుకోదేమో! దానికసలే భయం ఎక్కువ. పోనీ తనొక్కడూ అదేదో చేసుకుంటే? సీత ఏడుస్తుందా? యాడవకేం? పాపం ఈ పెళ్ళి సందట్లో దాన్ని ఏడిపించటం బాగుంటుందా? అయినా తను లేకపోతే ఆ దుర్మార్గ భర్త సీతనేం కష్టాలు పెడతాడో! తను బతికే వుండాలి. సీతకోసం బతికే వుండాలి! అత్తవారింటి కెళ్ళేటప్పుడు సీత తన దగ్గిరికొస్తుంది, సెలవు తీసుకోడానికి. తను ఆశీర్వదించాలి! ... సుబ్బారావుకి మళ్ళీ దగ్గు!

పెళ్ళి అయిపోయాక సీత మనసులోంచి డోలాం దోళన పోయింది. రెండు మూడు రోజులు సుంద రంతో గడిపాక సీత మనసులోంచి సుబ్బారావు పూర్తిగా ఫేడౌట్ (మాయం) అయిపోయాడు.

సీత అత్తారింటికి బయల్దేరేముందు చిన్న చిన్న గులాబీ పువ్వుల సిల్కు చీర కట్టుకుని, తలనిండా మల్లె పువ్వులు పెట్టుకుని, తమల పాకులు వేసుకుని సెంటు రాసిన రుమాలు చేతిలో పట్టుకుని, నవ్వుతూ సుబ్బారావు కోసం వచ్చింది.

గదిలో సుబ్బారావుని దిగులుగా మాసిన గడ్డం అదీ చూసి — "అలా వున్నావేంటి బావా? జ్వరం వొచ్చిందా? అమ్మమ్మ చెప్పలేదే!" అంటూ గడ్డం కింద చెయ్యిపెట్టి చూసింది.

సుబ్బారావు కొంచెం దగ్గుతూ — "తప్పు సీతా! నన్ను ముట్టుకోకు! నేను పరపురుషుణ్ణి నీకు" అన్నాడు.

"ఛ! ఏం మాటలు బావా? లేచి కూర్చో! నన్నిక మర్చిపోతావు కదూ?" అని నవ్వింది.

సుబ్బారావు కుములుతూ — "అలా మాట్లాడే కన్నా నా గుండెల్లో కత్తి గుచ్చరాదూ సీతా? నన్ను చిత్రహింస చెయ్యరాదూ?" అన్నాడు. లేచి కూచు న్నాడు. ఇటూ అటూ చూసి ఒక శాలువా తీసి భుజాల మీదనించి కప్పుకున్నాడు.

సీత నవ్వింది — "ఇంకా ఎందుకు బావా ఇదంతా? నా పెళ్ళిలాగూ అయిపోయింది. నువ్వు కాలేజీకి వెళ్ళిపో. అక్కడ స్నేహితుల్తో నీకు బాగా తోస్తుంది" అంది పక్కన కూచుని.

సీత ధోరణికి సుబ్బారావుకి చాలా కోపం వొచ్చింది. ఇలాంటి కష్టాల్లో, ఈ ఘట్టంలో ఇలాగేనా ప్రేయసీ ప్రియులు ప్రవర్తించాల్సింది? ప్రియురాలు కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ శెలవడుగు తుంది. ప్రియుడు తాను కుమిలిపోతూ గుండె నిబ్బరంతో ఆమెని ఓదారుస్తాడు, ఆశీర్వదిస్తాడు. సాగనంపుతాడు, ఆమె వెళ్ళిపోతూంటే తాను మొదలు నరికిన చెట్టులాగ కూలిపోతాడు — అంతేగానీ ... అలాగ ఎంత బాగుంటుంది?

"మాట్లాడవేం బావా? మళ్ళీ గడ్డం పెంచు తున్నావా? ఇంకా శలవు లెన్నాళ్ళున్నాయి? ఈ ఏడు బాగా చదివి పేసవ్వు. నాకెప్పుడన్నా ఉత్తరాలు రాస్తావా? మా ఊరు రారాదూ? సుందరం బావ కూడా నీ గురించి అడిగాడొకసారి" అని సీత గబగబా మాట్లాడింది.

సుబ్బారావు అంతా విని నిట్టూర్చి, "నేనిక చదవ లేను సీతా! — నా జీవిత దీపం ఆరిపోయాక, నా ప్రేమ నౌక మునిగిపోయాక, ఇంకా ఈ చదువులూ ఈ ఉద్యోగాలూ.... నేనీ ఉద్యోగాలు చెయ్యలేను. ఎందుకు సీతా, ఎందుకు? ఎవరికోసం?" అని పేలవంగా చూశాడు.

సీత తెల్లబోయింది — "చదువు మానేస్తావా? నిజంగానే! భలేవాడివే! ఇక్కడ కూచుని ఏం చేస్తావు? ఇంకా నా గురించి దిగులేనా! మనం మొదటే అను కున్నాంగా విడిపోతాం అనీ? అయినా మనం ఎప్పుడూ చుట్టాలమేగా? ఎప్పుడూ బావా మరదళ్ళమేగా? ఏం దూరం అయ్యాం? సుందరం బావమాత్రం పరాయి వాడా? — నన్నీ సంవత్సరం స్కూలు ఫైనల్ పూర్తి చేశాక, బెజవాళ్ళో కాలేజీలో చేరమంటున్నాడు. నేను సుఖంగా వుంటే చాలనే వాడివిగా? నువ్వుకూడా చక్కటి పిల్లని పెళ్ళిచేసుకుని...."

"సీతా!" అని అరిచాడు సుబ్బారావు. గుమ్మం లోంచి అప్పుడే తొంగి చూడబోయిన వర్లక్ష్మి హడలి పోయి నాయనమ్మ వెనకాల నక్కింది. ఆ పిల్ల సుందరం తరపున పెళ్ళి కొచ్చింది. సీతకు బాగా స్నేహితురాలయ్యింది. సీత వెనకాల బయల్దేరి వొచ్చి నాయనమ్మ పరామర్శలో చిక్కుపడిపోయి అప్పుడే అలా మండువాలోంచి గదిలోకి తొంగిచూడ బోయింది. అప్పుడే ఆ కేక!

"సీతా! ఇప్పుడంటే అన్నావు, ఇంకెప్పుడూ అనకు! నేను పెళ్ళి చేసుకుంటానా? నా ప్రేమంతా ఆవిరై గాలిలో కలిసిపోయిందనుకుంటున్నావా? నా జీవితం అంతా బ్రహ్మచారిగా వుండిపోతాను. నా జీవితం సంఘ సేవలో వెచ్చిస్తాను. నా జీవితం సన్యాసిగా గడిపేస్తాను."

వర్లక్ష్మికి ఆ మాట లేవిటో వొక్కముక్కా అర్థం కాలేదు — "ఆయన అనే దేవిటండీ అమ్మమ్మ గారూ?" అని అడిగింది నాయనమ్మని.

"ఏదో సినిమా కథో — పుస్తకం కథో చెప్తున్నాడు దానికి" అంది నాయనమ్మ.

ఇద్దరూ ముందు గదులు చూడ్డానికి వెళ్ళారు.

సీత చాలా విచారించి "నువ్వింత పట్టుదలగా వుండిపోతావని నేననుకోలేదు బావా! నా మూలాన్నే నీ జీవితం ధ్వంసం చేసుకున్నావు. ఆ పాపం నాదే!" అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. గుమ్మం వేపు అడుగు లేసింది.

సుబ్బారావు చాలా సంతృప్తి పడి "దుఃఖపడకు సీతా! ఈ జన్మలు ఇలా వెళ్ళిపోనీ! నువ్వు నీ భర్తతో.... బిడ్డలతో సుఖంగా వుండు. అంతకన్నా నేనేమీ కోరను" అన్నాడు కళ్ళు మూసుకుని. సరిగ్గా అప్పుడు దగ్గు కూడా వొచ్చింది సుబ్బారావుకి. లేచి నిలబడి గుమ్మం వరకూ వొచ్చాడు.

సీత కళ్ళు తుడుచుకుని, "వెళ్తాను బావా! నన్ను మర్చిపోకు!" అని వెళ్ళిపోయింది.

దారిలో వర్లక్ష్మి సీతని — "ఎలావుంది సినిమా?" అని అడిగింది.

"ఏం సినిమా?"

"అదే! ఆయన మీ కేదో చెప్తున్నారే!"

"అదా! అదీ!.... వరాలూ! మా బావ భలే మంచి

వాడే — పాపం పిచ్చివాడు గానీ...."

వర్లక్ష్మి అయోమయంలో పడిపోయింది.

★ ★ ★

కాలేజీ శెలవులు అయిపోయినా సుబ్బారావు వెళ్ళలేదు. కొత్త తెలుగు సినిమాలు కూడా సుబ్బారావు నిగ్రహాన్ని సడలించలేకపోయాయి. సుబ్బారావు లేక పోవటం వల్ల పెద్ద పెద్ద యాక్టర్లు వున్న సినిమాలు కూడా చాలా నష్టపడి రెండో వారంతో వెనక్కి పోయాయి! పత్రికలవాళ్ళు రివ్యూచేస్తూ — 'కథ అసహజంగా వుంది. పాటలు బాగలేవు. అంతా పాత టెక్నిక్కే' అని ఏవో పిచ్చి కారణాలు రాశారు. అసలు కారణం — సుబ్బారావు స్నేహితుల ముఠా 107 మంది, హఠాత్తు దాడిలాగ వచ్చి చెప్పారు — "వొరే సుబ్రావ్! నువ్వు రేపో మాపో వొచ్చి మా కష్టాలు గట్టెక్కి స్తావని నిరీక్షిస్తున్నాంరా! ఏమైంది నీకు? టైఫాయిడా? నువ్వు వెళ్ళాక మొన్న వారంలో — 'నిప్పుల ప్రేమ', 'ప్రేయసి గంగి' అట్టర్ ఫెయిల్యూర్‌రా! మొన్నే — 'ప్రేమ జ్వరం' రిలీజైంది. డబ్బాలు వెనక్కి పంపిం చెయ్యాలి — అంటున్నారు. మనం చూడకపోతే ఎల్లాగా? మీ నాన్న నడిగి వెయ్యి రూపాయిలు తీసుకుని బయల్దేరి వొచ్చేయ్ మాతో. లేకపోతే మన సినిమా ప్రొడ్యూసర్లు బొత్తిగా నష్టపోయి మనకోసం కళాఖండాలేవీ తియ్యకుండా మానేస్తారు. తర్వాత నీ ఇష్టం" అని బెదిరించారు.

సుబ్బారావు చాలా సంఘర్షణ పడ్డాడు పది నిమిషాలు. చివరికి స్నేహితుల మీదా, ప్రొడ్యూసర్ల మీదా చాలా కోపంగా — "నా ప్రేమ నౌకే బద్ద లయ్యాక, ఈ సినిమా వాళ్ళని రక్షించేదేవిఁటి? ఇన్నాళ్ళూ జ్ఞానం సంపాదించి నేనేం బావుకున్నాను?" అని విరక్తిపడి చాలా నిర్దయగా వుండిపోయాడు. ప్రాణమిత్రులు కాఫీలు తాగి వెళ్ళిపోయారు ఏడుస్తూ. గుమ్మం దాటాక నవ్వుతూ.

ఇప్పుడు సుబ్బారావుకి నాలుగంగుళాల పొడుగు గడ్డమూ, మీసాలూ వున్నాయి.

ఒక రోజు పక్కింటివాళ్ళ ఏడేళ్ళ సూరీడు చీకటి గదిలో సుబ్బారావుని చూసి కెవ్వున అరిచి — "బూచోడే అమ్మమ్మా!.... అక్కడే .... మంచంమీదే" అని ఏడుస్తూ కేకలెట్టింది, నాయనమ్మని చుట్టేసుకుని.

నాయనమ్మ గబగబ సూరీడు వీపు సవరించి, వీభూది పెట్టి — "ఛ! పిచ్చిముండా! బూచోడెక్కడే? మన సుబ్బన్న కాదూ?" అని ఓదార్చి ఆ పిల్లని పాలేర్ని సాయం ఇచ్చి పక్కింటికి పంపించింది. తర్వాత, పూర్వం చాలాసార్లు చెప్పినట్టే — "ఒరే! ఆ గడ్డం ఏమిట్రా? నీ తిండంతా అదే పీలుస్తోందిరా! నా మాట విన్రా!" అని చెప్పి వెళ్ళిపోయింది.

సుబ్బారావు అసలే లోకంలో వున్నాడో!

ఎప్పుడూ గదిలో పడుకుని ఆలోచిస్తూ వుంటాడు! పుస్తకం గుండెల మీద పెట్టుకుని కళ్ళు మూస్తాడు. తెరుస్తాడు. శూన్యంలోకి చూస్తున్నట్టు, పైకప్పుకి వేలాడుతోన్న సాలెగూళ్ళు చూస్తాడు. హఠాత్తుగా లేచి కూచుని గబగబా పజ్యాలో ఏవో రాస్తాడు. ఎవరికన్నా వినిపించాలని చాలా ఆతృతపుట్టి "నాయనమ్మా! పొయ్యి ఆర్పేసి వొక్కసారిలా రావే" అని గావుకేక పెడతాడు.

"ఎసట్లో బియ్యం వేశాక పొయ్యి ఆర్పనా? నువ్వే లేచి రారాదూ?" అని నాయనమ్మ ఎదురుకేక పెడు తుంది.

వొక్కోసారి సుబ్బారావే లేచి వెళ్ళి వొంటింటి గడపమీద కూచుని పజ్యం చదువుతాడు. తన గుండెల్లో గాలాలు వేశారంటాడు. గునపాలు గుచ్చా రంటాడు. తన ప్రేమ నౌకని నట్టేట ముంచారంటాడు. తన కంఠం నొక్కి వూపిరికి అడ్డుపడి ప్రాణాలు తీసేశారంటాడు.

ఆ చిత్రహింసలన్నీ విని — "ఏమిట్రా ఈ గొడ వంతా?" అంటుంది నాయనమ్మ.

"సీతనీ నన్నూ విడదీశారుగా? మీ కళ్ళు చల్ల బడ్డాయిగా? నాయనమ్మా! వొచ్చే జన్మలో నువ్వెవ ర్నన్నా ప్రేమిస్తే, నీకు మాత్రం వాడితో పెళ్ళవుతుం దనుకుంటున్నావా?"

"ఛీ! పిచ్చిసన్నాసీ! ఏం మాటల్రా? సీతనే చేసు కుంటానని వొక్కసారన్నా గట్టిగా అడిగావా? దాని తలదన్నే పిల్లని తెచ్చి పెళ్ళి చేస్తాను నీకు. సరేనా? అదే ఊడబొడిచిందా ఏమిటి?"

"హు! 'ప్రేమ' గురించి నాయనమ్మలకీ అమ్మమ్మలకీ ఏం తెలుస్తుంది?" అని సుబ్బారావు నిరుత్సాహంగా ఏకాంతంలోకి వెళ్ళిపోతాడు. అదే.... చీకటి గదిలోకి.

వొక రోజు భగవద్గీత చదవటానికి ప్రయత్నించాడు. నోరు తిరగలేదు. నాయనమ్మ దానికోసం వెతుక్కుంటూ వొచ్చి "నీ కెందుకురా ఈ పుస్తకం?" అని దాన్ని పట్టుకు పోయింది.

సుబ్బారావు ఇదివరకు నాయనమ్మ కేం కావలసినా కొట్టుకెళ్ళి తెచ్చిపెట్టేవాడు. ఇప్పుడు దేనికీ కదలటం లేదు.

వొకరోజు నాయనమ్మ సుబ్బారావు గదిలో కొచ్చి — "న్నాయన్నాయన! బుచ్చత్త తలనెప్పితో బాధ పడుతోంది. వొక్కసారి లేచి కొట్టుకెళ్ళి ఏదన్నా మాత్ర తెచ్చిపెట్టు!" అని బతిమాలింది.

"వాళ్ళ పాలేర్ని పంపరాదూ?" అన్నాడు సుబ్బారావు.

"వొక్కడూ పొలంనించి రాలేదు. ఆ వెర్రిబాగుల వాళ్ళని పంపిస్తేవొకదాని కొకటి పట్టుకొస్తారు. ప్రాణాలమీది కొస్తుంది. నిన్ను పంపిస్తానని చెప్పి వొచ్చాను. నా బాబుగాదూ! లే మరీ."

"ఎందుకు చెప్పొచ్చావూ! బోడిపెత్తనం, నేనెళ్ళను."

"అదేవిట్రా? అవతల తలనెప్పితో బాధపడుతోంటే."

"వెధవ తలనెప్పి. అదే పోతుంది."

"ఎలా పోతుందిరా, మందూ మాకూ లేకండా?"

"అసలు మందులూ గిందులూ అలవాటు చేస్తే అన్నీ తినమరిగి కూచుంటుంది. వెధవ తలనెప్పి కూడా బాధేనా? సిల్లీ!" ('ఈ జీవితం అంతా సంఘ సేవకి వెచ్చిస్తాను' అని సీతతో చెప్పిన సంగతి సుబ్బారావుకి జ్ఞాపకం లేదు. లేకపోతే, మందు తెచ్చి ఇచ్చి, సంఘ సేవానందం పొందేవాడే.)

నాయనమ్మకి చాలా కోపం వొచ్చేసింది "వొరే! నెల్లాళ్ళనించీ నీ వాలకం చూస్తున్నాను. చదువు లేదు, సంధ్య లేదు. తిండిలేదు, తిప్పల్లేవు. స్నానం చెయ్యవు, గడ్డం గీక్కోవు. ఓ మంచి లేదు, చెడ్డలేదు. ఇక్కడ చీపురుపుల్ల తీసి అక్కడ పెట్టవు. ఎంత ప్రాణాల మీదికి ముంచుకొచ్చినా వులకవు, పలకవు. ఏవిట్రా ఇదీ? సాటి మనిషిని కష్టంలో, సుఖంలో ఆదుకోకపోతే ఎందుకురా నీ చదువూ, నీ తిక్క పొడుగానూ!" అని తిట్టిపోసింది.

సుబ్బారావు యోగి వేమనలాగ కూచుని తిట్లన్నీ తిని — "సర్లే! డబ్బు లివ్వు పాషాణం మాత్రలు తెచ్చి ఇవ్వకపోతే అప్పుడు చూడు" అని నాయనమ్మ గుప్పెట్లో డబ్బులు లాక్కుని విసురుగా వెళ్ళాడు. సుబ్బారావు గోళ్ళు దిగి నాయనమ్మ చెయ్యి గీసుకు పోయి — నాయనమ్మ 'ఉఫ్ ఉఫ్' అని వూదుకుంటూ కూర్చుంది!

★ ★ ★

**వ**ర్లక్ష్మి సుబ్బారావునే పెళ్ళి చేసుకుంటానని వాళ్ళమ్మకి చెప్పేసింది — ('సుబ్బారావునే ప్రేమించాన'ని చెప్పలేదు. వాళ్ళమ్మ జడుసుకుంటుందని.)

వర్లక్ష్మికి సుబ్బారావులో నచ్చినవి మూడు విశేషాలు — అతని పొడుగూ, అతని తెలుపూ, అతని కోపం మాటలూ (తను విన్నప్పుడు). ఆ మూడూ నచ్చాయి.

వర్లక్ష్మి కూడా పొడుగే.

"ఇది ఇల్లా ఎదుగుతోంది. దీనికి మొగుడెక్కడ దొరుకుతాడ్రా?" అంటూంటారు చుట్టాలు.

"వడ్రంగం వాళ్ళకి చెప్పి చెక్క మొగుణ్ణి చేయించుకోవే" అని నవ్వుతారు.

"మా పెరట్లో వొక తాటిచెట్టుంది. అది మొగదే కూడాను. దానికిచ్చి చేసెయ్యండి!" అంటాడు వర్లక్ష్మి మేనమామ. ఆ మేనమామ కొడుకు తనకన్నా పొట్టివాడని వర్లక్ష్మే వాణ్ణి చేసుకోను పొమ్మంది.

వర్లక్ష్మి ఎంచుకున్న సమ్మంధం గురించి వాళ్ళ నాన్న శ్రద్ధపట్టి వాకబులు చేశాడు.

నాయనమ్మ ఒకనాడు సుబ్బారావుతో "మీ నాన్న సంబంధాలు చూస్తున్నాడు. పెళ్ళి చేసుకుంటావుట్రా?" అంది.

సుబ్బారావు ఎగిరి కంట్లోపడ్డాడు. "పెళ్ళా? నాకా? కావాలంటే నువ్వు చేసుకో!" అన్నాడు.

"అవ్వ!" అని నాయనమ్మ నోరు నొక్కుకుని మళ్ళీ తెరవలేదు.

వారం రోజుల్లో సీత దగ్గిర్నుంచి ఉత్తరం వచ్చింది సుబ్బారావుకి, వొక ఫోటోతో — "వరాలు ఎవరో కాదు. నా స్నేహితురాలే. చాలా మంచి పిల్ల. నీలాగే కాలేజీలో చదువుతోంది. మీరిద్దరూ కలిసి చదువుకో వొచ్చు. వరాల్ని నువ్వు చూస్తే కాదనలేవు. నా కోస మన్నా ఈ పెళ్ళిచేసుకో. నా మాటమీద నడుస్తాను అనేవాడివిగా?" అని రాసింది.

ఆ ఉత్తరం పూర్తిచెయ్యటానికి గంట పట్టింది. ఆ ఫోటో చూడ్డానికి 59 నిమిషాలూ, ఆ ఉత్తరం చదవ టానికి వొక్క నిమిషం.

ప్రేమ చరిత్రల్లో ఇట్లాంటి ఘట్టాలుండటం కూడా సుబ్బారావుకి గుర్తొచ్చింది. అవును, ప్రియురాలి ఆజ్ఞ లకు తను బద్ధుడు! ఆమె కిష్టమైన అమ్మాయినే చేసు కుని ఆమెని ఆనందపెట్టాలి. అయినా ప్రియురాళ్ళు కూడా మంచి సంబంధాలే కుదురుస్తారు. అసలు ప్రియురాళ్ళ కన్నా ఆ పిల్లలే అందంగా వుంటారు కూడా! ఛీ! ఇలా ఆలోచిస్తున్నానేమిటి? పర స్త్రీ అందంతో నాకేం పని? సీతే నా ఆరాధ్యదేవత. ఈ జీవితం బ్రహ్మచర్యంతో వెళ్ళిపోవాల్సిందే. స్త్రీని ముట్టేదిలేదు — కానీ, వర్లక్ష్మి అందంగానే వుంది.

"ఏవిట్రా, మీ నాన్న అడగమంటున్నాడు. సీత నీకు ఫోటోగ్రాపు పంపిందంటగా? ఆ పిల్లని చేసు కుంటావా?" అంది నాయనమ్మ అప్పటికి నోరు తెరిచి.

"నన్నడగటం ఎందుకు? చెయ్యండి. బలి పశువునేగా? మీ కిష్టమొచ్చినట్టు నా మెడలు వొంచి చెయ్యండి!" అన్నాడు విరక్తిగా.

"అదేవిటి? నీ కిష్టంలేకపోతే నిన్నేం కట్టి పడేసి చేస్తారా? చేస్తే ఊరుకుంటావా?"

"ఊరుకుంటే చేస్తారుగా?"

"ఊరుకునే వాజెమ్మలకి చేస్తేయేం?"

"అయితే చేసెయ్యండి, మీ ఇష్టం."

ముసలమ్మకేం బోధ పళ్ళేదు.

సుబ్బారావుని నాన్నకూడా అడిగాడు తర్వాత.

"నీ ఇష్టం నాన్నా!" అన్నాడు వినయంగా తల వొంచుకుని.

"నా ఇష్టం ఏమిటోయ్? సరిగ్గా చెప్పు!" అని ఎగిరి, ఆ నాన్న ఆ సంబంధమే ఖాయం చేశాడు.

నాయనమ్మ అస్తమానూ వర్లక్ష్మి కబుర్లే చెప్తోంది — "సుబ్బా! నువ్వు పిల్లని చూళ్ళేదు గానీ — మా చెడ్డ అందంలే. చారెడేసి కళ్ళు. బారెడేసి జెళ్ళు. ముక్కూ, మొహం బొమ్మకి చెక్కినట్టే. నేనప్పుడే అను కున్నాను, మా సుబ్బడికి ఈ పిల్లే ఈడవుతుందని...."

"బోడి పెత్తనం! ఎందు కనుకున్నావూ?

నా ఇష్టం అక్కర్లేదా?" అని ఎగిరాడు. నాయ నమ్మ ఆ సంతోషంలో ఏమీ పట్టించుకోక — "పెళ్ళాం కూడా వొస్తోంటే ఇంకా ఈ కుర్ర వేషాలేనా సన్నాసీ?" అని ముద్దుగా తిట్టింది.

★ ★ ★

శోభనం పెళ్ళి కొడుకు సుబ్బారావు తెల్ల పైజామా చొక్కా వేసుకున్నాడు. తలంటుకున్న తల. నిలువు బొట్టు. సీత, హాస్యానికి బుగ్గన చుక్క పెట్టి — "బలే ముద్దొస్తున్నావు బావా!" అంది.

సుబ్బారావు ఉలిక్కిపడి "మన ప్రేమ నౌక మునిగిపోయాక ఏం మాటలు సీతా!" అన్నట్టు చూశాడు. నిరాశగా కళ్ళు తిప్పాడు.

"జీవితం అంతా బ్రహ్మచారిగా వుంటానన్నా వుగా?" అంది సీత వెటకారంగా.

సుబ్బారావు గదిచుట్టూ కళ్ళు తిప్పి — "నా దేహా నికే ఈ పెళ్ళిచేశారు సీతా! నీకు తెలీదా? నా ఆత్మ నీ పాదాలమీదే పడి వుంది కదా?" అని నిట్టూర్చాడు.

సీత నవ్వి " 'గుండెల్లో కత్తి' సినిమాలోవేనా ఈ మాటలు?" అని చెంపమీద కొట్టి — వెళ్ళిపోయింది.

ఇల్లంతా మాటు మణిగింది. చుట్టాలంతా పెళ్ళి కూతురు పూర్నించే ఉడాయించారు. వర్లక్ష్మితో ఇద్దరో ముగ్గురో వచ్చారు. వాళ్ళు వాకిళ్ళలో మంచాలమీద పడుకుని నాయనమ్మతో పూర్వకాలం కబుర్లలో పడి మునిగిపోయారు.

గదిలో సుబ్బారావుకి దూరంగా వర్లక్ష్మి, వనలక్ష్మి లాగ, అప్సరసలాగ, నిలబడి వుంది అరగంటనుంచీ.

అప్పుడప్పుడూ చేతులు కదిలిస్తోంది. గాజులు విసుక్కుంటున్నాయి. వొక్కోసారి కళ్ళు అటూ ఇటూ తప్పతోంది. ఎటు తిప్పితే అటు కాంతి పడుతోంది. ఆ కాంతి రెండు మూడుసార్లు సుబ్బారావు మీదపడి కంగారు పెట్టింది. (సుబ్బారావు గుండెల ముందు మైక్ పెడితే ఆ దడదడ, వూరంతా వినబడి ఏమయ్యేదో మరి.) సుబ్బారావు రెండుసార్లు మంచినీళ్ళ బల్ల దగ్గిరికి నడవాలని ప్రయత్నించాడు. నాలుగోసారి గ్లాసెత్తి నీళ్ళు తాగలేక పెట్టేశాడు.

తల వోరగా తిప్పి చూస్తే వర్లక్ష్మి కిటికీ దగ్గర నిలబడి చెట్లలోకి, చీకట్లోకి చూస్తోంది. ఎందుకలా నిలబడి వుంది? తను వొచ్చి లాలిస్తాడని కలలు కంటోందా? హు! కల్ల!

గదంతా అగరొత్తుల సువాసనల్తో నిండిపోయింది. వర్లక్ష్మి పూల జళ్ళోంచి మల్లెపూలు, దవనం గుబాళిస్తున్నాయి. బట్టల మీదనించి ఏవేవో పరిమళాలు! (సుబ్బారావు బట్టల మీదనించి కూడా. సీత నవ్వుతూ అతని బట్టల నిండా దుప్పట్లనిండా సెంట్లు గుమ్మరించింది.)

ఇప్పుడు సుబ్బారావు కూడా వర్లక్ష్మి దగ్గిరే వున్నాడు. ఎవరు తీసుకొచ్చారో అని తెల్లబోయాడు. కిటికీలోంచి చల్లగాలి వొచ్చి దాగుడు మూతల్లో దొంగ వొచ్చి ముట్టుకున్నట్టు వొళ్ళంతా ముట్టుకుంటోంది.

"కిటికీ ఎందుకు తీశావు? ఎవరన్నా చూస్తారు" అన్నాడు నెమ్మదిగా. వర్లక్ష్మి కొంచెం తలతిప్పింది. నోరు విప్పలేదు.

"వేసెయ్యనా?" అని లాలనగా చూశాడు.

మాట్లాడలేదు.

మాట్లాడదేం! అందంగా వుంది, సీతకన్నా! హూ! ఆ దేవత కన్నానా?

"పడుకోరాదూ? నిద్దర్రావటం లేదూ?"

నేలచూపులు చూస్తోంది. కింది పెదిమ పంటి కింద నొక్కుతోంది. కొంచెం చేతులు కదిలిస్తే గాజులు గలగలమన్నాయి.

"ఏమిటీ న్యూసెన్స్! అలారం లాగ. తీసెయ్యరాదూ?"

అరె! ఎంత పలకరించినా మాట్లాడదేం? ఇంకేం చెయ్యాలి? ప్రేమగా కౌగిట్లోకి తీసుకుని లాలించాలి కావున్ను. హు! ఈ జన్మలో స్త్రీని తాకేది లేదు.

"ఏమిటలా ఆలోచిస్తున్నావు?"

కొంచెం మెత్తగా నవ్వింది.

"వర్లక్ష్మీ! మాట్లాడవూ?"

కళ్ళెత్తి సిగ్గుపడి దించుకుంది.

సుబ్బారావు ఉలిక్కిపడ్డాడు. ఆ చూపుల్లో విషాదచ్ఛాయలు కనపడ్డా యేవిఁటి! అంత దుఖ్ఖమే! వర్లక్ష్మికి ఈ పెళ్ళి ఇష్టం లేదా? బలవంతంగా చేశారా?

"వర్లక్ష్మీ! నువ్వెవర్ని ప్రేమించావు?" జాలిగా అడిగాడు.

తెల్లబోయింది వర్లక్ష్మి.

"నిజం చెప్పు! నాకు చెప్పటానికేం? నేను అందర్లాంటి భర్తనికాను. నిన్ను నీ ప్రియుడి దగ్గిరికి పంపించేస్తాను. చెప్పు వర్లక్ష్మీ!"

("మా బావ కొంచెం తిక్కగా మాట్లాడతాడు. నువ్వు జడుసుకోకు. ఎంత మంచివాడో తర్వాత నీకే తెలుస్తుందిగా" అని సీత అన్నప్పుడు ఆ మాటలు అప్పుడు సరిగ్గా అర్థం కాలేదు వర్లక్ష్మికి)

"చెప్పు వరాలూ! నీ ప్రేమకి ఎవరడ్డు పడ్డారు? పెద్దవాళ్ళే కదూ? అంతే వరాలూ! ఈ రాక్షసులు...."

"కాదు, పెద్దవాళ్ళందరూ వొప్పుకున్నారు."

"వొప్పుకున్నారూ? ఆశ్చర్యంగా వుందే! మరి ఎవరు నీ ప్రేమ లతని...."

"ఆయనే...."

"ఆయనెవడు?"

"నేను ప్రేమించినాయనే.... వొప్పుకోలేదు."

"అదేవిఁటి? మరైతే ఎందుకు ప్రేమించావు.....? ఓహో! తొలి చూపుల్లో ప్రేమ అన్నమాట? ఊఁ, తర్వాత?" — ప్రేమలో రకాలు అన్నీ సుబ్బారావుకి తెలిసినవే.

"ఆయన వొప్పుకోరని నాకేం తెలుస్తుంది? మీరే చెప్పండి!"

"అవును. నీ కెలా తెలుస్తుంది?" అని చాలా విచారించాడు. (సుబ్బారావు నిర్మలమైన ఆత్మలోకి

ఇంకా అసూయ ద్వేషాలు ప్రవేశించలేదు. ఎవరు ఎక్కడ ప్రేమ కష్టాలుపడ్డా అతను సహించలేడు.)

"అయితే ఆ మూర్ఖుడెందుకు వొప్పుకోలేదు? వొక అమాయకురాలైన ఆడపిల్ల ప్రేమించి వొస్తే....! ఇంత అందమైన, నిర్మలమైన...."

"నేను అందమైన దాన్ని కానులెండి."

"నీ మొహం! నీకేం తెలుసు?"

"ఆయనకి నా అందం నచ్చలేదేమో?"

"వాడి మెహం! వాడికేం తెలుసు?"

"మరి ఎవరికి తెలుస్తుంది?"

"నే చెప్తున్నాగా? నీ కళ్ళు కలవల్లా గుంటాయి. నీ జుట్టు కెరటాల్లాగ.... నీ పెదాలు.... సరే, సరే! నేను వర్ణించకూడదనుకో. ఇంతకీ ఆ దుర్మార్గుడెందుకు వొప్పుకో లేదు? పిరికి సన్యాసా? నాన్న కూచి కొడుకా?"

"అవ్వేమీ కాదు. ఆయన ఇంకో అందమైన అమ్మాయిని ప్రేమించారు!"

"అయ్యోపాపం, అలాగా? అయితే మాత్రం? .... అందం ఏమిటి, వాడి మొహం! ప్రేమ హృదయం చూడాలి గానీ...., 'ప్రేమలో కసి' సినిమాలో ఇల్లాగే అయింది. ఆ పిచ్చి సన్యాసి అందానికి మోసపోయి.... గుణవతి అయిన ప్రియురాల్ని తిరస్కరించాడు.

చివరికి.... సర్లే! పోనీ, వాళ్ళిద్దరన్నా పెళ్ళి చేసు కున్నారా?"

"లేదు. ఆ అమ్మాయి అవతల ఇంకో అబ్బాయిని ప్రేమించింది."

"అరె! చాలా హాచ్చర్యంగా వుందే! ఇలాంటి కథ నేనెక్కడా విన్నట్టులేదే! ఊ!.... తర్వాత? పోనీ ఆ అవతల వాళ్ళిద్దరన్నా పెళ్ళిచేసుకున్నారా?"

"ఏమో! వాళ్ళ గొడవ ఎవడి క్కావాలి? నాకు తెలీదు."

"ఛచ్చచ్చా! ఎంత సస్పెన్సులో తోసేశావు వర్లక్ష్మీ!" అని గిలగిల్లాడాడు సుబ్బారావు.

"నేనేం చేశానూ?" అని బిక్కమొహం వేసింది వర్లక్ష్మి.

సుబ్బారావు చాలా జాలిపడి "మరి.... అయితే .... ఇంతకీ, అతను .... అదే .... నువ్వు .... అదే ప్రేమించినబ్బాయిని .... మర్చిపోలేవూ?"

"ఎల్లా మర్చిపోతానండీ? నా హృదయం అంతా ఆయన కిచ్చి...."

"అవును. పాపం నువ్వు మాత్రం ఏం చేస్తావు?" అని మళ్ళీ చాలా విచారించాడు. ప్రేమకి — ముసిలి వాళ్ళో — సంఘమో — దేవుడో — అడ్డు పడతారను కున్నాడేగానీ ఇన్నాళ్ళూ .... ప్రియుడే అడ్డు పడతా డన్నమాట! ఎంత దారుణం! అవును. కొంచెం జ్ఞాపకం వొస్తోంది. 'నీ కత్తా, నా కత్తా?' నవల్లో .... ఇలాగే .... జరిగింది.

"పడుకో వర్లక్ష్మి! నువ్వు మంచంమీద పడుకో; నేను చాపకింద పడుకుంటాను."

"భలే వారే! మీరు చాప కింద పడుకుంటారా? నేనే పడుకుంటాల్లెండి" అని చుట్టూ చాపకోసం చూసింది. అది కనపళ్ళేదు. వరలక్ష్మి మంచంమీద మడతపెట్టివున్న తెల్లదుప్పటి తీసి కిటికీ దగ్గిర పరుచు కుంది.

సుబ్బారావు వూరుకున్నాడు.

అవును. భార్యలే నేలమీద పడుకుంటారు. ఇంతకీ వర్లక్ష్మికూడా భగ్న ప్రేమికురాలే. ఆ మాటకొస్తే తనే సేవ చెయ్యాలి, ఆ దురదృష్టవంతురాలికి. అయితే తనే కిందపడుకోవాలి. అదే న్యాయం!

అప్పటికే వర్లక్ష్మి కింద పడుకుని కళ్ళు మూసు కుంది. సుబ్బారావు మెత్తటి పరుపులో దూరి పడుకుని పట్టెమీద మొహంపెట్టి వర్లక్ష్మిని చూస్తూ వుండి పోయాడు.

వర్లక్ష్మి పూలజడ దిండు మీదనించి జారి నేలమీద పొరాడుతోంది.

"జడకింద పడింది, తీసుకో" అన్నాడు.

వర్లక్ష్మి కదల్లేదు. తీసుకోలేదు. కుచ్చెళ్ళల్లోంచి పాదాలు కొంచెం కొంచెం తెల్లగా కనబడుతున్నాయి. సన్నని నడుమూ, చేతులూ— భుజాలూ — చెంపలూ — కళ్ళూ అన్నీ, ఆశగా చూస్తూనే వున్నాడు సుబ్బా రావు.

చేతిలోంచి జారి నేలమీద పడ్డ పువ్వులా వుంది వర్లక్ష్మి. చూసిచూసి నిట్టూర్చాడు — ఇద్దరం ఇలా కృంగి కృశించాల్సిందేనా? ఇంతేనా జీవిత భాగ్యం?

ఎప్పటికో కొంచెం మత్తు ఆలోచనల్తో నిద్ర పట్టింది. కలలో వెచ్చగా మధురంగా ఏదో స్పర్శతో కొంచెం మెలుకువొచ్చేసరికి, వర్లక్ష్మి అతని పక్కలో కరుచుకుని పడుకుని వుంది.

గదిలో మసక వెలుగు — కిటికీలోంచి వెన్నెల. చల్లగాలి. చుట్టూ పరిమళాలు. నడుంమీద వర్లక్ష్మి చేతులు! సుబ్బారావు మూర్ఛబోయాడు.

వర్లక్ష్మి చెప్పలేని సేవలుచేసి (అబద్ధాలెందుగ్గానీ — చెప్పలేనివి కాదు. చెప్పరానివి. అంటే ఏంలేదు. చిన్న ముద్దు పెట్టుకుని.) అతన్ని మూర్ఛనించి లేపింది.

సుబ్బారావు వర్లక్ష్మి పమిట్లో మొహం దాచుకుని — "వరాలూ! నిజం చెప్పవూ? నేనంటే నీకేమీ ఇష్టం లేదూ? బొత్తిగా అనురాగం లేదూ?" అని జాలిగా అడిగాడు.

వర్లక్ష్మి కరిగి నీరైపోయి సుబ్బారావుని ఇంకా గాఢంగా అల్లుకుని — "ఇందాక మాటలన్నీ తమాషాకి చెప్పాను. అసలు నేను ప్రేమించింది మిమ్మల్నే. సీత పెళ్ళిలో మిమ్మల్ని చూసినప్పుడే అనుకున్నాను. మీరు నన్ను పెళ్ళి చేసుకోకపోతే చచ్చిపోవాలని" అంది.

"నిజంగానే! అంత ప్రేమా నేనంటే?" అని సుబ్బారావు కూడా వర్లక్ష్మిని గట్టిగా ముద్దుపెట్టుకున్నాడు.

★ ★ ★

"తెల్లారిందర్రా! పిచ్చి సన్నాసులూ" అని నాయనమ్మ తలుపులు కొడుతోంటే వర్లక్ష్మి వులిక్కిపడి మంచంమీంచి దూకబోయింది. సుబ్బారావు వెనక్కి లాగి — బలవంతంగా పడుకోబెట్టి దుప్పటికప్పేసి, తను పక్కన పడుకుంటూ — నాయనమ్మకి జవాబు కంఠంతో "తెల్లారితే ఏం చెయ్యమన్నావు? మేం లేవకపోతే సూర్యుడు రానన్నాడా ఏమిటి? ఫో, ఫో! — అర్జంటుగా ఫ్లాస్కుతో కాఫీ తెచ్చి గుమ్మం ముందు పెట్టి ఎవరింటి కన్నా ఫో!" అని కసిరాడు.

"మొహాలు కడుక్కోర్రా?"

"నీ మొహం! నువ్వు కడుక్కో పదిసార్లు."

"అవ్వ! ఇదేం చోద్యమమ్మా!"

"అస్తమానూ అలా నొక్కుకునే బుగ్గల అందం అంతా పాడుచేసుకున్నావు. బుద్ధిలేదు. ఇంక రాదు."

వర్లక్ష్మి సుబ్బారావు నోరుమూసి — "చాల్లే, మతిపోయిందా? పెద్దావిణ్ణి పట్టుకుని ఏవిటా మాటలు? అమ్మమ్మ ఎంత మంచిది!" అని మొగుణ్ణి కసిరి మంచం మీదనించి దూకేసింది.

సుబ్బారావు మండిపడ్డాడు — "నువ్విలా అలుసిచ్చావంటే ఈ పెద్ద వాళ్ళు — ఈ దుర్మార్గులు — మనల్ని విడదియ్యాలని చూస్తారు. మన ప్రేమని భగ్నం చెయ్యాలని చూస్తారు. ఏమనుకున్నావో!"

"హారే సుబ్బా! సీత వొస్తోందిరోయ్!" అని నాయనమ్మ ఉత్సాహంగా కేకపెట్టింది.

"సీతెవరు? పొమ్మను! వేళాపాళా లేదా ఏంటి! సీతకీ గీతకీ!"

వర్లక్ష్మి నవ్వి — "మీ ప్రియురాలు, అప్పుడేనా మర్చిపోడం?" అంది.

"నోర్ముయ్యి! నువ్వే నా ప్రియురాలివి. నువ్వే నా దేవతవి .... నువ్వు నా....! ఇంత మంది ప్రియురాళ్ళు లేరు నాకు."

అంతలో సీత తలుపుల మీద కొట్టి — "బావా! లేవ్వోయ్! బారెడు పొద్దెక్కింది" అని పిలిచింది.

"చూశావా వరాలూ! వీళ్ళంతా యమకింకరుల్లాగ ఎల్లా మూగుతున్నారో! అంతే లోకం. ప్రేమికుల్ని బతకనివ్వరు. సరిగ్గా ఇలాగే 'ప్రేమ పిట్టలు' సినిమాలో.... ఏ మవుతుందంటే.... కూర్చో! కథ చెప్పేస్తాను."

వర్లక్ష్మికి చాలా కోపంవొచ్చింది — "ఈసారి మళ్ళీ ఆ వెధవ సినిమా కబుర్లు మాట్లాడితే వూరుకోను. చెంప పగుల్తుంది" అని బెదిరించి మంచం దిగింది.

సుబ్బారావు కిక్కురు మనలేదు. తల వాలేసి, కళ్ళు తేలేసి, మొహం వేళ్ళాడేశాడు.

[1973 జనవరి 'స్వాతి' మాసపత్రికలో] ★